


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్స్, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
# చివరి విడత: మలి సందడి (29)

## బెర్లిన్లో మేమూ - ఆస్తికత్వమూ

రావుగారి మాటలకు తటపటాయిస్తూనే, “ఏదో నా పని నేను చేసుకుపోవడమే తప్ప, ఇంతవరకూ ఏ విషయంలోనూ, దేవుడి గురించి ఎక్కువగా ఆలోచించలేదు. సంప్రదాయం పాటిస్తాం కాబట్టి – వినాయక చవితి, వరలక్ష్మీ పూజ వగైరాలు శ్రద్ధగానే జరుపుతాం. అప్పుడు కూడా దైవభక్తికంటే నియమానికీ, నిష్ఠకీ ప్రాధాన్యం ఇస్తాం. తిరుపతి వెళ్లినా అదో రొటీనే తప్ప ప్రత్యేకమైన భక్తిభావం ఉన్నట్లు తోచదు. అవసరాలు తీర్చమని కానీ, కోరికలు సాధించాలని కానీ, సాయం చెయ్యమని కానీ – దేవుణ్ణి ప్రార్థించిన సందర్భాలు నా విషయంలోనూ, శ్రీమతి విషయంలోనూ కూడా ఇప్పటివరకూ అరుదనే చెప్పాలి” అన్నాను.

రావుగారు నవ్వాడు, “ఈ విషయంలో మీరే కాదు, బాగా చదువుకున్న చాలామంది పద్ధతి కూడా ఇదే! నేనూ మీ కోవకు చెందినవాణ్ణే. ఐతే మనకి తెలియందేమిటంటే, ఎవరిమీదో ఆధారపడకుండా మనకు జీవితంలో ఒక్కడుగు కూడా ముందుకు పడదని! చిన్నప్పుడు కొన్నింటికి తల్లిమీదా, కొన్నింటికి తండ్రిమీదా ఆధారపడాలి. కాస్త పెద్దయ్యేక స్నేహితులేర్పడతారు. కొన్నింటికి వాళ్లు మనమీదా, కొన్నింటికి మనం వాళ్లమీదా ఆధారపడక తప్పదు. ఎందుకంటే మనిషి సంఘజీవి. మీరే ఆలోచించండి! ఈనాడు మీరీ దశకు చేరుకుందుకు మీ స్వయంకృషి మాత్రమే కారణమని నమ్ముతారా?”

రావుగారు అరటిపండొలిచినట్లు చెప్పాడు. కాదని ఎలాగనడం?

నా విషయానికొస్తే – చదువు విషయంలో యూనివర్సిటీ దాటేదాకా నేను అన్నింటికీ మా తాతగారిమీదా, కొంతవరకూ నాకంటే ఓ ఏడాది మాత్రమే పెద్దవాడైన మా అన్నయ్యమీదా ఆధారపడ్డాను. ఎంత శ్రద్ధగా చదివినా, చదివింది ఆకళింపు చేసుకునేందుకు సరిపడ తెలివితేటలు ఉన్నా – మా తాతగారు సరైన సమయంలో సరైన దిశానిర్దేశం చెయ్యడమే – నేటి నా హోదాకి కారణం. ఆయన లేకుంటే, నేను గ్రాడ్యుయేషనుతో చదువు ఆపి, ఎక్కడో చిన్న గుమస్తా ఉద్యోగంలో చేరి భారంగా బ్రతుకుబండిని ఈడుస్తూండేవాణ్ణి. కొన్ని సమస్యల్ని నాకు నేనుగా పరిష్కరించుకున్నా – అన్నింటికీ ఆయనున్నారన్న ధైర్యమే ఎన్నోమార్లు విపత్కర పరిస్థితుల్లో నన్నాదుకుంది. నా చదువైపోయేక కూడా, ఆయన మరికొన్నేళ్లు బ్రతికుంటే ఇంకా ఎంతో బాగుండేదని నాకు తరచుగా అనిపిస్తూంటుంది.

ఈ విషయం రావుగారికి చెప్పాను.

రావుగారు నవ్వి, “నిజాయితీగా చెప్పారు. మీరన్నదాన్ని బట్టి అప్పట్లో మీ తాతగారు మీకు దేవుడు. ఆయన పక్కన లేనప్పుడు కూడా, ఆయనున్నారన్న భావనే మీకు ధైర్యం. భక్తులు విష్ణువునో, శివుణ్ణో తల్చుకున్నట్లు మీరాయన్ను తల్చుకుని ధైర్యంగా ఉండేవారు. కానీ మీ తాతగారు మనిషి కాబట్టి, ఆయన ఉనికి శాశ్వతం కాదు. దేవుడి ఉనికి శాశ్వతం. ఆయన్ని నమ్మితే, మనమున్నంతకాలం ధైర్యం మనని వెన్నంటే ఉంటుంది. సాటి మనిషి సాయం తీసుకుంటూ, స్వయంకృషిని నమ్ముకుంటూ – అన్నింటికీ దేవుడిపై భారం వేస్తే – అది మనసుకిచ్చే తృప్తి – దేవుణ్ణి నమ్మినవారికే తెలుస్తుంది. దేవుణ్ణి నమ్మడం అంటే మూఢత్వం కాదు, జీవన సౌలభ్యంకోసం చిన్న సద్దుబాటు – అంతే!” అన్నాడు.

ఇది ఆస్తికత్వంలో ఓ హేతువాదం. వినడానికి బాగుండడమే కాదు, ఆచరణకూ వీలుగా ఉంటుంది.

“చాలా బాగా చెప్పారు. ఎటొచ్చీ దేవుడికే వదిలిపెట్టాల్సినంత పెద్ద సమస్యలు మనకెప్పుడో కానీ రావు. వచ్చినప్పుడు తప్పక దేవుణ్ణి తల్చుకుంటాను” అన్నాను.

“భలేవారే! సమస్య పెద్దదో, చిన్నదో తెలుసుకోగల వివేకం ఏ మనిషికీ ఉండదు. ఎందుకంటే మనసొక లెన్సు లాంటిది. ఓ పక్క కాన్వెక్సు. ఓ పక్క కాంక్లేవు. ఎట్నించి చూస్తున్నాం అన్నదాన్ని బట్టి సమస్య పెద్దదో, చిన్నదో ఔతుంది. నన్నే తీసుకోండి. నాకు ఇండియా అంటే ప్రాణం. మా ఊరంటే ప్రాణం. తెలుగంటే ప్రాణం. మావాళ్లంటే ప్రాణం. అందర్నీ వదులుకుని పొట్ట చేతబట్టుకుని ఇక్కడికొచ్చాను. ఒకోసారి గ్లూమీగా అనిపిస్తుంది. అదీకాక ఇక్కడా, అక్కడా కూడా తరచుగా ఏవో సమస్యలు వస్తూనే ఉంటాయి. పరిష్కారం నావల్ల కాదనిపించినప్పుడల్లా – ఓ కార్డుమీద నా సమస్య వ్రాసి – బాబాగారి చిరునామాకు పోస్టు చేస్తాను. ఆ తర్వాత ఆ సమస్య గురించి పట్టించుకోను. అన్నీ ఆయనే చూసుకుంటాడు” అన్నాడు రావుగారు.

కష్టాలొచ్చినప్పుడు ఏ తిరుపతి వెంకన్నకో మొక్కుకునేవాళ్లు నాకు తెలుసు. కానీ ఇలా దేవుడికి ఉత్తరం వ్రాయడం నేనెరుగను. ఆ దేవుడు కూడా నిజంగా దేవుడు కాదు. మనకిలాగే ఉండి మనమధ్యనే తిరుగుతూ, దేవుణ్నని చెప్పుకునే ఓ మనిషి!

పోనీ రావుగారు మామూలు మనిషా అనుకుంటే, ప్రతిభావంతుడైన ఇంజనీరు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన సీమెన్సు కంపెనీలో పని చేస్తున్నాడు. అదీ ఇండియాలో కాదు – ఆర్థికంగా, వైజ్ఞానికంగా అగ్రస్థానంలో ఉన్న పశ్చిమ జర్మనీలో.

“నేనిలా అంటున్నానని ఏమనుకోవద్దు. ఎందుకో చెప్పలేను కానీ – మన మధ్య తిరుగుతూ, మనలో నమ్మకం కలిగించడానికి ఇంద్రజాలాన్ని ప్రదర్శించే మనలాంటి మనిషిని దేవుడనుకుందుకు నాకు మనస్కరించదు. అదే ఏ రాముడో, కృష్ణుడో అయితే – వేల సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం కాబట్టి – అది వేరే సంగతి!” అన్నాను.

రావుగారు నవ్వి, “బాబాగారిది ఇంద్రజాలం కాదు. ఆయనలోని దైవత్వం చూపే మహిమ. ఆయనే కాదు, పూర్వకాలంలో రాముడూ మహిమలు చూపాడు. కృష్ణుడూ మహిమలు చూపాడు. నమ్మినవాళ్లు దేవుడన్నారు. నమ్మనివాళ్లు అంతరించిపోయారు. అప్పటికీ, ఇప్పటికీ వాళ్ల దైవత్వాన్ని శంకించినవాళ్లు కొందరుండొచ్చు. కానీ ఎన్నో వేల సంవత్సరాల తర్వాత కూడా మెజారిటీ జనం వాళ్ల దైవత్వాన్ని నమ్మి ఆరాధిస్తున్నారు. ఆ కాలంలో పుట్టకపోవడం నా దురదృష్టమని నేను బాధపడేవాణ్ణి. సత్యసాయిబాబా ఆ బాధను తొలగించాడు. ఈయన మన కాలంలో పుట్టడం మనందరి అదృష్టం. అందుకు సంతోషించక, ఆ కాలపు శిశుపాలుడిలా ఆలోచిస్తే అంతకంటే దురదృష్టముండదు” అన్నాడు.

బాబాగారిని దేవుడిగా నమ్మకపోతే, ముందు తరాలవాళ్లు నన్నో శిశుపాలుడిగా చిత్రీకరిస్తారని రావుగారు బెదిరిస్తున్నాడా అనిపించింది. శిశుపాలుడికీ నాకూ ఉన్న తేడాని సహేతుకంగా ఆయనకు వివరించాలనిపించినా, అలా చెయ్యలేదు. ఎందుకంటే రావుగారు తన నమ్మకాన్ని నామీద రుద్దడం లేదు. ఆ నమ్మకంతో తాను పొందిన ప్రయోజనాలు నాకూ కలగాలని తాపత్రయ పడుతున్నాడు. చూస్తే అతడు బాబాగారికి వీరభక్తుడిలా ఉన్నాడు. అతడి భక్తివల్ల అతడికి ప్రమాదం ఉందనుకోను. అతడు మారాల్సిన అవసరం ఉందనుకోను. ఒకవేళ అతణ్ణి మార్చాలని నేననుకుంటే, అందువల్ల ఎవరికి ప్రయోజనం?

పదిమందికి సాయపడే మంచి మనసున్న రావుగారి లక్షణాలకు ప్రతిబంధకం కానప్పుడు అతడి భక్తి అతడిష్టం – అంతే కదా!

చర్చను పెంచడం ఇష్టం లేక, “బాగా చెప్పారు” అన్నాను.

“చెప్పింది నేను కాదు. బాబాగారు. మిమ్మల్ని కలుసుకోవడం, మీకివన్నీ చెప్పడం అంతా బాబా సంకల్పం. ఐతే, మామూలు మనిషినైన నాకు ఆ మహానుభావుడి గురించి చెప్పగల సత్తా లేదు. అందుకే ఇవి తెచ్చాను” అంటూ ఒక సంచిలోంచి రెండు పుస్తకాలు తీశాడతడు.

అతడిచ్చిన వాటిలో ఒకటి – పుట్టపర్తిలో సత్యసాయిబాబా ఆశ్రమం నుంచి బాబాగారి సారథ్యంలో వెలువడుతున్న సనాతన సారధి అనే పత్రిక తాలూకు తాజా సంచిక. "ఇది చదివితే బాబాగారి ఆశ్రమ వివరాలు, అక్కడి వివిధ కార్యక్రమాలు తెలుస్తాయి. పురాణ విశేషాలని విశ్లేషిస్తూ, బాబాగారు రాసిన వ్యాసాలు చదివితే – మన అవగాహన బాగా పెరుగుతుంది. అదీకాక దైవలీలల్ని దైవమే వివరించి చెబుతుంటే వినడం ఒక అపూర్వానుభవం. భారతంలో గీతను విన్న అర్జునుడికి పట్టిన అదృష్టం మనకు పట్టినట్లే కదా!" అన్నాడతడు.

నాకైతే అతడు జోక్ చేస్తున్నాడా అని అనుమానమొచ్చి పరీక్షగా చూశాను. కానీ అతడి కళ్లలో ఆ పుస్తకం చదివిన స్మృతులు కలిగించిన పరవశం స్పష్టంగా కనిపించింది.

రావుగారిచ్చిన రెండో పుస్తకం – హోవార్డ్ మర్ఫెట్ అనే ఆస్ట్రేలియన్ భక్తుడు సత్య సాయిబాబాతో స్వానుభవాల్ని ప్రస్తావిస్తూ – ఆయన్ను ప్రపంచానికి పరిచయం చేసిన 'మాన్ ఆఫ్ మిరకిల్స్'. "ఇది చదివితే – బాబా గారి విశ్వరూపం సాక్షాత్కరిస్తుంది" అన్నాడతడు.

ఎందుకో నాకా పుస్తకాలమీద ఆసక్తి పుట్టలేదు. కానీ ఆ మాటలు అతడి గుండె లోతుల్నించీ వస్తున్నట్లపించి – అతడి ఆంతర్యాన్ని గౌరవించి, అభిమానానికి తలవంచి – వాటినిచ్చినందుకు థాంక్సు చెప్పాను.

"అప్పుడే థాంక్సు చెప్పేస్తే ఎలా? ఇచ్చింది చాలు అన్నట్లు అనిపించదూ!" అన్నాడతడు.

తడబడి, "అర్థం కాలేదు" అన్నాను.

"మీకోసం తెచ్చింది ఇంకొకటుంది. ఇవ్వనా, వద్దా?" అన్నాడు రావుగారు.

ఈసారి అతడి మాటల్లో హాస్యస్ఫూర్తి ధ్వనించడంతో మనసు కొంచెం తేలికపడి, "అయ్యో, ఇవ్వండి" అన్నాను కాస్త నొచ్చుకుంటూ.

"ఇవ్వడానికి నేనూ కొంచెం తటపటాయిస్తున్నాను. ఎందుకంటే ఇచ్చేముందు, ఉపోద్ఘాతం చెప్పాలి, తప్పదు" అన్నాడు రావుగారు.

1960లలో ఆంధ్రా యూనివర్సిటీ వేదికపైన తొలిసారిగా మిమిక్రీ విద్యను పరిచయం చేసిన మాన్యులు శ్రీ నేరెళ్ల వేణు మాధవ్, "ఇది తెలుగువారికి కొత్తగా పరిచయమౌతున్న కళ కాబట్టి, ఉపోద్ఘాతం తప్పనిసరి. ఐతే అది బంగాళాఖాతమంత అవకుండా జాగ్రత్త పడతాన్లెండి" అని చమత్కరించారు. ఉపోద్ఘాతం అన్న పదం విన్నప్పుడల్లా – నాకా మాటలు గుర్తొస్తుంటాయి.

"బంగాళాఖాతమంత ఉన్నా, చెప్పేది మీరైతే ఉపోద్ఘాతాన్ని వినడానికి నేను రెడీ" అని అతణ్ణి ప్రోత్సహించాను.

రావుగారు గొంతు సవరించుకున్నాడు.

రెండ్రోజులక్రితం ఎందుకో అతడికి బాబాగారితో మాట్లాడాలనిపించింది. భార్యకి చెబితే, "అయ్యో! బాబాగారి గొంతు అనుకరించి మాట్లాడదామంటే, నాకు మిమిక్రీ రాదే!" అని నొచ్చుకుంది.

"మిమిక్రీ రాకపోతేనేం, ఆయన పాడే పాటలు పాడు. బాబా మహిమతో నీ గొంతులో నాకాయన గొంతు వినిపిస్తుందిలే" అన్నాడతడు.

"ఐతేమాత్రం– ఆయన గొంతు మీరు వినడమే తప్ప మీకు ఆయనతో మాట్లాడ్డం అవదుగా" అందామె.

"వెర్రిదానా – బాబాగారితో మాట్లాడ్డమంటే – ఆయన గొంతు నేను వినడమే! నా గొంతు ఆయనకు వినిపించడం కాదు. నా మనసులో ఏమున్నదీ, ఆయనకు చెప్పకుండానే తెలుస్తుంది మరి!" అన్నాడతడు.

ఆమె మంచి గాయని. వినసొంపుగా 'గోవింద హరే గోపాల హరే' అంటూ బాబా తరచుగా పాడే భక్తి గీతాన్ని ఆలపించింది.

పాట సగంలో ఉండగా అతడు ఆపమని సైగ చేసి, "నా భక్తిభావంలో లోపముంది. నీ గొంతు నీ గొంతులాగే వినిపిస్తోంది" అన్నాడు.

తన భక్తిభావంలో లోపముందని అతడనుకున్నందుకు బాబాగారు నొచ్చుకున్నారు కాబోలు – ఆ సాయంత్రం కుర్ఫ్యూర్‌స్టెన్ డామ్ దగ్గరున్న 'కా డే వే' షాపుకి పనిమీద వెడితే, అనుకోకుండా అక్కడ బాబా స్వయంగా పాడిన భక్తిగీతమాల రికార్డు కళ్లబడింది.

సాధారణంగా అక్కడ అలాంటి రికార్డులు దొరకవు. అంటే – బాబా తన గొంతుని వినే అవకాశం ఇలా కల్పించేడన్న మాట!

ఇదీ ఉపోద్ఘాతం.

"అప్పుడలా అనుకున్నానా! అసలు విషయం తర్వాత అర్థమయింది. మీతో మా పరిచయమూ బాబా సంకల్పమే! మన తొలి పరిచయం అపూర్వం కావడానికి ఆ రికార్డు రూపంలో ఆయన నన్ను కరుణించాడు. నాతోపాటు మీకూ తన గొంతు రోజూ వినే అర్హత ఉందని అర్థమై, ఆ రికార్డుని కాసెట్లోకి దింపి మీకోసం తీసుకొచ్చాను" అంటూ అతడు తన జేబులోంచి ఓ కాసెట్ తీసిచ్చాడు.

అతడి గొంతులో భక్తిభావం. మొహంలో భక్తిభావం. రెండూ అపూర్వంగా ఉండి నన్ను విచలితుణ్ణి చేశాయి.

కాసెట్టుని తిరుపతి ప్రసాదంలా అందుకుని, అప్రయత్నంగా కళ్లకి అద్దుకుని శ్రీమతికి అందించాను.

ఆమె కూడా దాన్ని అంతటి భక్తిభావంతోనూ కళ్లకి అద్దుకుని పక్కన పెట్టింది.

రావుగారికి మహదానందమైంది. "మా నాన్నగారనేవారు – ఏమిచ్చామన్నది కాదు, ఎవరికిచ్చామన్నది ముఖ్యమని! బాబా మహిమ మీరే చూస్తారు. ఇక జర్మనీలో మీకు అంతా శుభమే జరుగుతుంది" అన్నాడు ఆప్యాయంగా.

"మీ నోటిమాట నాకు దీవెనలా ఉంది" అన్నాను నేనూ సంతోషంగా.

"మీరు ఆ కాసెట్టుని కాపీ చేసుకున్నాక నాకు మళ్లీ ఇచ్చెయ్యాలి. ఎందుకంటే, పాటలు వినడానికి రికార్డుకంటే, కాసెట్ వాడడం ఎక్కువ వీలు. మీకు అనుకూలంగా ఉంటుందని అందాకా ఆ కాసెట్టుని త్యాగం చేస్తున్నాననుకోండి" అన్నాడు రావుగారు.

ఆ కాసెట్ నాకు దేవుడు పక్కనున్న అనుభూతిని ఎలా కలిగించిందీ అన్న ఆసక్తికరమైన విశేషాన్ని చెప్పబోయే ముందు – గతంలో నన్ను సత్యసాయి గురించిన ఆలోచనలకు పురిగొల్పిన సన్నిహితుల గురించి చెప్పాలి.

నేనూ నా భక్తమిత్రులూ

సత్యసాయిబాబాని దేవుడిగా నమ్మినవారు ఎందరున్నారో, నమ్మనివారు అంతకంటే ఎక్కువే ఉన్నారు. వారిలో కొందరు తమకు తెలిసిన పురాణకాలపు దేవుళ్ల జాబితాలో ఆయన్ను చేర్చడాన్ని ఏమాత్రం ఇష్టపడరు. కొందరు ఆయన దేవుడైతే మనకేంటి, కాకపోతే మనకేంటి అనుకుంటారు. కొందరు మాత్రం, ఆయన తన్ను తాను దేవుడిగా ప్రకటించుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తారు. వారిలో కొందరు హేతువాదులు, మేధావులు, జ్ఞానసంపన్నులు అయితే – అలాంటివారిని నిరసించడంలో జాతిహితం ఉందంటారు.

ఒక రచయితగా సత్యాన్వేషిని అనుకునే నేను, ఏ కోవకు చెందుతానో నాకే స్పష్టత లేదు. కానీ మా అమ్మ సత్యసాయిని నమ్మడమే కాక – మా ఆఖరి చెల్లికి ఆయన పేరు పెట్టింది. బాబా గురించి చిన్న పొల్లు మాట అన్నా తను భరించలేదు. ఆయన్ను నిరసించడం అమ్మని బాధ పెట్టడమేనని నాకు తోచేది. అదీకాక తన నమ్మకంవల్ల అమ్మకి తగిన ఓదార్పు లభించి, ధైర్యం కలిగి సంతోషంగా ఉండేది. ఆపైన ఆమె నమ్మకంవల్ల మిగతావారికి ఏ ప్రమాదం, నష్టం లేదు.

రీసెర్చి రోజుల్లో నా మిత్రుడొకడు – బాబాగారివి క్షుద్రశక్తులనీ, శంకరాచార్యులు దైవస్వరూపుడనీ నమ్మేవాడు. అందుకు ఉదాహరణగా కొన్ని కథలు చెప్పేవాడు. అవన్నీ ఇక్కడ అప్రస్తుతం.

ఒక సాయి భక్తుడు నామీద కోపమొచ్చినప్పుడు, "నా జోలికొచ్చావో, మా బాబా నిన్ను సర్వనాశనం చేస్తాడు" అన్నాడు. నాకు చిరాకేసి, "అంటే నీ ఉద్దేశ్యంలో బాబా ఎవరు? దేవుడా? లేక నువ్వు ఏర్పాటు చేసుకున్న గూండానా?" అన్నాను. అప్పటికి తన మాటల్ని ఇలా కూడా అనుకోవచ్చని అర్థమయినట్లుంది – ఆ తర్వాత అతగాడు నన్ను భయపెట్టడానికి బాబా పేరు వాడలేదు.

రీసెర్చి సమయంలో చాలామంది బాబా భక్తుల్ని గమనించాను. వారిలో స్వార్థం, అహం, అసహనం ఎక్కువగా ఉండడం గమనించి, "అవేనా వారి భక్తికి కారణం? అవి కాదనుకున్నా – తన భక్తుల్లో ఈ లక్షణాల్ని హరించలేనివాడు దేవుడౌతాడా?" అనిపించేది.

నా రూంమేట్ బీఎల్ నా ఆలోచనల్ని విశ్లేషిస్తూ, "నిజం చెప్పాలంటే నాలోనూ ఇదే భావం ఉంది. కానీ స్వార్థం, అహం, అసహనం – ఒక్క బాబా భక్తులకే పరిమితం కాదు. అవి మనుషులందరికీ సహజం. మరి ప్రతి మనిషీ ఏదో ఒక దేవుణ్ణి నమ్ముతాడు. మనకిలా ఆలోచిస్తే – ఈ ప్రపంచంలో ఏ దేవుణ్ణీ నమ్మకూడదు. అపనమ్మకాన్ని ఒక్క బాబాకే అంటగట్టడమెందుకు?" అన్నాడు.

ఆ మాటలతో నా ఆలోచనల్లో ఏదో లోపం ఉందనిపించింది. సైంటిస్టుగా అప్పటికే ఉన్నత శిఖరాలని అధిరోహించిన సూరి భగవంతం, బాబాగారికి అనుచరుడయ్యేడంటే – ఆయనకి ఈ మాత్రం ఆలోచన స్ఫురించకనా?

నా జీవితం నాది, బాబా దేవుడైతే నాకేంటి, కాకపోతే నాకేంటి అని తప్పించుకున్నా – సత్యసాయి భక్తులు ఎవరో ఒకరు నాకు దగ్గరై – నన్ను ఆయన గురించిన ఆలోచనలకు దూరం కానివ్వడం లేదు.

భువనేశ్వర్లో రీజినల్ రీసెర్చి లాబొరేటరీలో సైంటిస్టుగా చేరేక – నాకు ఆఫీసులో చాలామంది భక్తులు తటస్థపడ్డారు. వారు బాబా వల్ల తమకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరాయో చెప్పేవారు.

"కర్మఫలాన్ని తప్పించడం ఆ విధాతకు కూడా సాధ్యం కాదు" అని మన పురాణాలు చెబుతాయి. మరి రాముడైనా, కృష్ణుడైనా, బాబా ఐనా – మనకి ప్రయోజనాలు చేకూర్చడమేమిటనిపించేది. ఐనా మనకి ప్రయోజనం కలిగించేవాడు మిత్రుడో, బంధువో కావాలి తప్ప – దేవుడెలాగౌతాడనుకునేవాణ్ణి.

"మా ఇంటికి భజనకు రా. ఆ సమూహంలో పాల్గొంటే, నీకు భక్తి దానంతటదే పుట్టుకొస్తుంది" అని కొందరు మిత్రులు తమ ఇళ్లకు అహ్వానించారు. వీలు కాదని తప్పించుకునేవాణ్ణి.

ఐతే ఒక్క విషయం నాకు ఆశ్చర్యంగా ఉండేది. సామాన్య కుటుంబంలో పుట్టిన ఒక వ్యక్తి – మన రాష్ట్రంలోనే కాక, దేశంలోనే కాక, విదేశాల్లో కూడా అసంఖ్యాక భక్తుల్ని ప్రభావితం చెయ్యడం ఎలా సాధ్య పడింది?

జనం మూర్ఖత్వమా లేక ఆయన మానవాతీతుడు కావడమా?

ఇలాంటి మీమాంసలో ఉండగానే – నాకు శ్రీనివాసరావుగారు పరిచయమయ్యారు. అతడు భువనేశ్వర్లో ఉత్కళ యూనివర్సిటీలో స్టాటిస్టిక్సు విభాగంలో ఆచార్యుడు. అతడు యూనివర్సిటీ కాంపసులో ఉంటున్నాడు. ఆ కాంపసుకి వాణీవిహార్ అన్న చక్కని పేరు. అది మా లాబొరేటరీ కాంపసుకి పక్కనే ఉంది. ఆదిలో మా కాంపసునుంచి ఊళ్లోకి వెళ్లాలంటే, టౌనుబస్సులు ఎక్కడానికి వాణీవిహార్ వెళ్లాల్సి ఉండేది.

శ్రీనివాసరావుకి తెలుగుతనం ఇష్టం. తెలుగు సినిమాలు ఇష్టం. తెలుగువాళ్లతో పరిచయం ఇష్టం. అతడితో మా పరిచయం వాణీవిహార్ బస్సుస్టాపు దగ్గర మొదలై, ఊళ్లోని సినిమా హాలు దగ్గర బలపడి, క్రమంగా ఒకరిళ్లకు ఒకరు వెళ్లేటంత సాన్నిహిత్యానికి దారి తీసింది.

ఇప్పుడీ శ్రీనివాసరావు ప్రస్తావన ఎందుకంటే, ఆయన సత్యసాయికి వీరభక్తుడు. ఆయన ఇంట్లో బాబాకి ఓ గదిని ప్రత్యేకించారు. ఆ గదిలో మధ్యన సింహాసనంలాంటి ఓ పెద్ద కుర్చీలో, నిలువెత్తు పటం. అందులో పొడవాటి కాషాయపు అంగీలో, అభయహస్తమిస్తూ, మందహాసం చేస్తున్న సత్యసాయిబాబా చిత్రం. చూడగానే అప్రయత్నంగా చేతులు జోడించాలనిపిస్తుంది.

వారం వారం తప్పనిసరిగానూ, అప్పుడప్పుడు పర్వదినాల్లోనూ శ్రీనివాసరావింట్లో భజనలు జరిగేవి.

పరిచయమైన వారానికే అతడు నన్ను భజనకు ఆహ్వానించాడు.

అదేమిటో, ఎవరు పిలిచినా భజనకు వెళ్లనివాణ్ణి – అతడి విషయంలో వెంటనే సరేనన్నాను.

ఆశయాలూ, ఆదర్శాలూ అనుకుంటాం కానీ – ఒకరు పిలిచే తీరు మన స్పందనల్ని పూర్తిగా మార్చెయ్యగలదు.

శ్రీనివాసరావు ఇంటికొచ్చిన భక్తులు సామాన్యులు కారు. వారిలో అయ్యేయస్ ఆఫీసర్లు, రాజకీయ ప్రముఖులు, వాణిజ్య ప్రముఖులు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు — అందరూ విద్యలోనో, హోదాలోనో, జ్ఞానంలోనో — ఉన్నత హోదాలో ఉన్నవాళ్లే.

అక్కడున్న అందరిలోకీ వయసులోనూ, హోదాలోనూ కూడా నేనే చిన్నవాణ్ణి.

వచ్చినవాళ్లు అంతా మనస్పూర్తిగా శ్రీనివాసరావు పట్ల భక్తి, గౌరవ, వినయాలను ప్రకటించారు. ఒకరొక్కరుగా భజన పాటలు పాడారు. తర్వాత ఓ ప్రొఫెసరుగారు దేవుడి గురించి ఉపన్యాసం ఇచ్చారు.

'దేవుడు కంటికి కనిపించడు. అయినా ఆయన్ని నమ్మాలి. అందుకంటే పానకంలోని తీపి కనిపించదు. తీగలో కరెంటు కనిపించదు. ఐనా ఆరెంటినీ నమ్మి, తగిన ప్రయోజనాలు పొందుతున్నాం' — అన్నది ఆయన మాటల సారాంశం.

తగినంత వయసు, అనుభవం, జ్ఞానం ఉన్న ప్రొఫెసరునుంచి నేనాశించినది చాలా ఎక్కువ కావడంవల్లనో ఏమో, నాకా వివరణ చాలా ప్రాథమిక దశలో ఉన్నట్లు అనిపించింది. ఆయన చెప్పిన కారణాలను కొట్టిపారెయ్యడానికి – నా స్థాయి హేతువాదమూ, తర్కమూ చాలనిపించింది.

అదలాగుంచి – సత్యసాయిని దేవుడనడానికి అక్కడివారు ఒకొక్కరుగా కొన్ని నిదర్శనాలు చెప్పారు. అన్నీ వ్యక్తిగత ప్రయోజనాలకు సంబంధించిన స్వానుభవాలే! అంటే – భక్తి అన్నది స్వప్రయోజనాలకు సాధనం. బాబా వల్ల స్వప్రయోజనాలు నెరవేరడమే – వారి భక్తికి కారణమనిపించింది.

అక్కడ చేరినవారి మాటలు విన్నాక – అక్కడ నా హోదా, వయసు చిన్నవన్న భావన తొలగిపోయింది.

ఐతే శ్రీనివాసరావు మిగతా భక్తులకు భిన్నం. బాబా కారణంగా అతడికి పెద్దవారితో పరిచయాలు ఏర్పడ్డ మాట నిజం. కానీ, అవి కేవలం భజనలకూ, భక్తి సమావేశాలకూ మాత్రమే పరిమితం. జీతమొక్కటే ఆధారమైన ఆయన జీవితగమనం, ఆ జీతపు పరిమితులకు లోబడి ఉండేది. చాలాకాలం అతడికి స్కూటరు కూడా లేదు. ప్రతిఫలాపేక్ష లేకుండా బాబాని సేవించేవాడు. బాబాగారి విశ్లేషణాత్మక వ్యాసాలు చదివి మురిసిపోయేవాడు. బాబాని తల్చుకుంటే ఆయనలో కలిగే పరవశం, కృష్ణుడి కాలంలో రాధని స్ఫురింపజేసేది.

ఉపాధ్యాయవృత్తికి న్యాయం చేస్తూ, విద్యార్థుల్లో మంచి టీచరన్న పేరు తెచ్చుకున్నాడు. బాబా పేరిట జరిగే నారాయణని భక్తిశ్రద్ధలతో నిర్వహించేవాడు. కానీ ఉద్యోగంలో ప్రమోషన్ కోసం యూనివర్సిటీలో ఎవర్నీ సేవించడు. పదోన్నతి మాత్రమే కాదు, తనకే మంచి జరిగినా – అది బాబా దీవెన అంటాడు.

సమస్యలెదురైనప్పుడు పరిష్కారానికి బాబాని ప్రార్థించడు. "ఈ సమస్య బాబా సంకల్పం. దాన్ని నేను గౌరవించాలి. పరిష్కారం చూపాలా, వద్దా అన్నది ఆయన నిర్ణయం" అనేవాడు.

తర్వాతెప్పుడో యూనివర్సిటీ ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన రిజిస్ట్రారు పదవి ఇవ్వాలనుకుంది. ఆ పదవికి బాధ్యతలెక్కువనీ, బాబాని సేవించుకుందుకు ప్రతిబంధకమౌతుందనీ భావించి మృదువుగా తిరస్కరించాడాయన.

ఐతే బాబాకి సంబంధించిన వివాదాస్పదమైన మహిమలు అతడింట్లో జరిగాయి. వాళ్లింట్లో అప్పుడప్పుడు బాబా పటం ఫ్రేంనుంచి విభూతి రాలేది. తరచుగా — ఆ పటంలో బాబా పాదాలవద్ద కుంకుమ ఉద్భవించేది. ఇంకా రకరకాల మహిమలు జరిగేవి. అవి చూడ్డానికి చాలామంది వాళ్లింటికి వెళ్లేవారు.

ఇలాంటి విశేషాలు అతడు నాకు చెప్పి, తన ఇంట్లో అలా జరుగుతున్నందుకు మురిసిపోయేవాడు.

పటానికి విభూతి రాలడానికి ఆగ్జాలిక్ యాసిడ్ వాడతారనీ, ఇతర మహిమలు కూడా ఇంద్రజాల విద్యలే తప్ప మహిమలు కాదనీ పత్రికల్లో చదివాను. ఐతే నేను శ్రీనివాసరావుని ఏమాత్రం శంకించలేకపోయాను. నేనే కాదు, ఎరిగినవారెవరూ అతణ్ణి ఈ విషయంలో శంకించలేరు. నిజంగానే ఆ మహిమల్లో ఆయన హస్తమున్నా, అది బాబాకి ప్రచారమే తప్ప – వ్యక్తిగత ప్రయోజనాలకి కాదు.

'నీ మిత్రులెవరో చెప్పు. నువ్వేమిటో నేను చెబుతాను' అంటారు అనుభవజ్ఞులు.

'నీ భక్తులెవరో చెప్పు. నువ్వేమిటో నేను చెబుతాను' అన్నది దేవుడికి వర్తిస్తుందని నేనంటాను.

బాబాపై గౌరవభావం కలగడానికి శ్రీనివాసరావు వంటి భక్తుడు ఒక్కడు చాలు. బహుశా అలాంటి వారు చాలామందే ఉండి ఉంటారు. అదే బాబా ప్రాభవానికి కారణమయుండొచ్చని నాకు అనిపించేది.

నావరకూ వస్తే, బాబా గురించి చాలా అనుమానాలుండేవి. వాటిలో కొన్ని శ్రీనివాసరావు చెప్పే విశేషాల్లోంచే పుట్టుకొచ్చేవి. కానీ పొరపాటున కూడా నేను బాబా విషయంలో ఆయనవద్ద నోరు జారలేదు.

పురాణాల్లో కూడా భక్తి విషయంలో అర్జునుడంతటివాణ్ణి అనుమానించొచ్చు. కానీ రంతిదేవుడు, అంబరీషుడు వంటివారి ముందు నోరు పెగలదు.

శ్రీనివాసరావు ఎంతటి భక్తిపరుడైనా, నాకు మంచిమిత్రుడైనా – భక్తి పరంగా నా ఉపేక్షాభావాన్ని గ్రహించలేని అమాయకుడూ కాదు. బాబా గురించి ఎంతవరకూ పంచుకోవాలో, అంతవరకే విశేషాల్ని చెప్పేవాడు. తన ఇంట్లో భజనలకు రమ్మని నన్ను నొక్కించలేదు. విశిష్టమైన భజనలు ఉన్నప్పుడు మాత్రం, నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించేవాడు. కానీ నేను వెళ్లకపోతే ఆ ప్రస్తావన తెచ్చి నిష్ఠూరం వేసేవాడు కాదు. నేనూ అతడూ ఎక్కువగా తెలుగు సినిమాల గురించీ, పత్రికల గురించీ మాట్లాడుకునేవాళ్లం. మేమెప్పుడు కలుసుకున్నా – ఆహ్లాదకరంగా ఉండేదే తప్ప – వివాదాస్పద చర్చలు మామధ్య జరుగలేదు.

ఆ తర్వాత మళ్లీ ఇదిగో ఇప్పుడు నాకు రావుగారి రూపంలో మరో సాయి వీరభక్తుడు తటస్థపడ్డాడు.

అతడికీ, ఇతడికీ పోలికలు అనతగ్గవి కొన్ని ఉన్నాయి.

శ్రీనివాసరావు సత్యసాయి భక్త సమాజానికి సంబంధించి ఒరిస్సాలో రాష్ట్రస్థాయి ఉన్నత పదవిలో ఉన్నాడు. ఈ రావుగారి అన్న కూడా రాజస్థాన్ యూనివర్సిటీలో పని చేస్తూ – సత్యసాయి భక్త సమాజానికి రాష్ట్రస్థాయి ఉన్నత పదవిలో ఉన్నాడు.

ఈ రావు, ఆ రావు కూడా – బాబానుంచి ధన కనక వస్తు వాహనాలనూ, సాంఘిక ఆర్థిక ప్రయోజనాల్నీ ఆశించడం లేదు. వారు కోరేది మనశ్శాంతి, సార్థకమైన జీవితం.

నా విషయంలో మాత్రం ఈ రావు ఆ రావు కంటే రెండడుగులు ముందుకేసి, ఇంట్లో నన్ను బాబా గొంతులో భజనలు వినమన్నారు.

"పాపం, ఆయనకు ఆ కాసెట్ ప్రాణంలా ఉంది. మనం వెంటనే రికార్డు చేసుకుని, ఆయనకు వెనక్కిచ్చేద్దాం" అంది శ్రీమతి నాతో.

"అలాగే కానీ – ముందు మనం ఒక లాటరీ టికెట్ కొనాలి. తర్వాతనే రికార్డింగు" అన్నాను.

జర్మనీలో ఫెర్న్‌జెహ్ (టివి) లాటరీ గురించి గతంలో చెప్పాను. 50 ఫెన్నిగ్సుకి ఓ టికెట్. వాటిని కియోస్కుల్లో అమ్ముతారు. అందులో 1 నుంచి 36 అంకెలుండేవని గుర్తు. వాటిలో ఆరింటిని ఎంచుకుని కియోస్కులో ఇవ్వాలి. వారం వారం డ్రా తీసి టివిలో చూపిస్తారు. అన్ని అంకెలూ సరిపోతే మిలియన్ మార్కుల బహుమానం. ఎంతమందికొస్తే అంతమందీ పంచుకోవాలి. అక్కణ్ణించి ఐదు అంకెలకు ఇంత, నాలుగింటికి ఇంత అని అదే పద్ధతిలో బహుమతి పంపకం ఉంటుంది. తక్కువ మొత్తాల్ని కియోస్కుల్లోంచి తీసుకోవచ్చు.

ఆర్నెల్ల సావాసంలో వారు వీరౌతారంటారు. లాటరీ టికెట్ కొంటాననడంలో నా ఉద్దేశ్యం శ్రీమతికి అర్థమయింది. "అంటే బాబా భజనకీ లాటరీ బహుమతికీ లంకె పెడుతున్నారా? నమ్మకమే కాదు, పవిత్రతకూ సంబంధించిన విషయాల్లో వేళాకోళం పనికి రాదు" అంది.

"నీ ఊహ కొంతవరకూ కరెక్టే. కానీ – భగవంతుడు భక్తులకు పరీక్షలు పెడితే, అదాయన లీల అంటున్నాం కదా! భక్తుడు భగవంతుడికి పరీక్ష పెడితే, అది వేళాకోళం ఎందుకౌతుంది?" అన్నాను.

శ్రీమతి అప్రయత్నంగా లెంపలేసుకుని, "మీకు తోచినట్లు చెయ్యండి కానీ, ఇంక దీని గురించి వాదన పెంచొద్దు" అని అక్కడితో త్రుంచేసింది. సరేనని నేనూ ఊరుకున్నాను.

దేవుడు నా పక్కనున్న అనుభూతికి దారితీసే విచిత్ర సంఘటన ఒకటి నాకోసం ఎదురు చూస్తోందని అప్పుడు నాకు తెలియదు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments